క్లుప్తంగా

విద్యార్థులకు ఆయుర్వేద వైద్య శిబిరం



వేదాద్రి(జగ్గయ్యపేట): స్థానిక మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయుర్వేద వైద్యుడు కృష్ణమోహన్ మాట్లాడుతూ విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. ముఖ్యంగా ఇంగ్లిష్, హోమియోతో పాటు ఆయుర్వేద వైద్యం కూడా అందుబాటులో ఉందని గ్రహించాలన్నారు. అనంతరం విద్యార్థులకు వైద్య పరీక్షలు చేసి మందులు అందించారు. ఎంఈవో చిట్టిబాబు, ప్రధానోపాధ్యాయుడు ప్రవీణ్‌కుమార్, యోగా టీచర్ అశ్విని, ఉపాధ్యాయుడు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న తహసీల్దార్‌కు సన్మానం



పెనుగంచిప్రోలు: ఎన్నికల విధుల్లో భాగంగా మండలానికి వచ్చిన తహసీల్దార్ వి. అమ్మాజీ తన సొంత జిల్లా రాజమండ్రికి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆమెను ఘనంగా సత్కరించారు. డీటీ భాస్కరరావు, ఆర్ఐ డి. జనార్దనరావు, జూనియర్ అసిస్టెంట్ నివేదిత్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల పాత్ర కీలకం

జమ్మవరం(వీరులపాడు): విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దటంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని ఎంఈవో పాల్ కెనడి పేర్కొన్నారు. మండలంలోని జమ్మవరం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థులకు అర్థమయ్యేలా సులభరీతిలో విద్యా బోధన చేయాలన్నారు. ప్రతి విద్యార్థి ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని అందుకనుగుణంగా ముందుకు సాగాలన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం

జగ్గయ్యపేట అర్బన్ : పేట మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం బుధవారం నిర్వహించనున్నట్లు మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. కౌన్సిల్ మీటింగ్ హాల్‌లో ఉదయం 11 గంటలకు జరుగు ఈ సమావేశంలో పట్టణంలోని పలు అభివృద్ధి పనులు, పరిపాలనకు సంబంధించిన కేటాయింపులు తదితర 35 అంశాలతో కూడిన అజెండాను కౌన్సిల్ ఆమోదం కోసం సిద్ధం చేసినట్లు తెలిపారు.

నేడు సర్వసభ్య సమావేశం

వత్సవాయి: మండల సర్వసభ్య సమావేశాన్ని బుధవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో టీసీకేజీ భరత్‌రాజ్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు కార్యాలయంలోని సమావేశ మందిరంలో ప్రారంభమవుతుందన్నారు. సభ్యులందరూ హాజరు కావాలని కోరారు.

అక్రమంగా ఇసుక తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని శాంతినగర్‌లో అనధికారికంగా ఇసుకను పొక్లయినర్ సహాయంతో లోడింగ్ చేస్తున్న వ్యక్తిని మంగళవారం రాత్రి పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు జగ్గయ్యపేట స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్ ఇన్‌స్పెక్టర్ మణికంఠరెడ్డి తెలిపారు. శాంతినగర్‌లో నివాసం ఉంటున్న పగడాల శ్రీనివాసరెడ్డి అనే వ్యక్తి తన స్థలంలో అనధికారికంగా 40 టన్నుల ఇసుకను నిల్వ ఉంచి రాత్రి సమయంలో తరలించడానికి ప్రయత్నిస్తుండగా ఎస్ఈబీ అధికారులు దాడి చేసి పట్టుకున్నట్లు తెలిపారు. టిప్పర్ యజమానిని, పొక్లయినర్ ఆపరేటర్‌ను అదుపులోకి తీసుకొని 30 టన్నుల ఇసుకతో సహా టిప్పర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు.

పేట కర్మాగారాల్లో తనిఖీలు

జగ్గయ్యపేట: మండలంలోని ముక్త్యాల గ్రామంలో కేసీపీ సిమెంట్స్ కర్మాగారంతో పాటు జగ్గయ్యపేట ఆటోనగర్‌లోని ఇండస్ట్రియల్ పార్కులో ఐనిష్, దినకర్, ఎస్ఎల్ ఫార్మా కర్మాగారాలను మంగళవారం ఇండస్ట్రియల్ ఫ్యాక్టరీతో పాటు పలు శాఖల అధికారులు తనిఖీ చేశారు. ఫ్యాక్టరీస్ జనరల్ మేనేజర్ రాజు ఆధ్వర్యంలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, అగ్నిమాపక, విద్యుత్, బాయిలర్ తదితర శాఖల అధికారులు తనిఖీ చేసి వివరాలను అడిగి తెలుసుకున్నారు.

సేవతో ఆత్మ సంతృప్తి

ముచ్చింతాల(పెనుగంచిప్రోలు): సేవ చేయటం ద్వారా ఆత్మ సంతృప్తి కలుగుతుందని సర్పంచ్ జక్కులూరి రాంబాబు అన్నారు. మండలంలోని అనిగండ్లపాడు గ్రామానికి చెందిన అమ్మానాన్న సోషల్ సేవా ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో ముచ్చింతాల, లింగగూడెం గ్రామాల్లో వృద్ధులు, అనాథలకు వస్త్రాలు, దుప్పట్లను దాతల సహకారంతో పంపిణీ చేశారు. ఫౌండేషన్ వ్యవస్థాపకుడు దోర్నాల నాగయ్య పాల్గొన్నారు.

తిరుపతమ్మ భక్తులకు వసతి కష్టాలు

- అందుబాటులో లేని ఏసీ గదులు
- సత్రాల బాగోగులను పట్టించుకోని అధికారులు
- ఆరు బయటే భక్తుల వంటావార్పు



తిరుపతమ్మ సదన్ ఇదే

పెనుగంచిప్రోలు: కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా పెనుగంచిప్రోలు శ్రీతిరుపతమ్మవారు రెండు తెలుగు రాష్ట్రాల ప్రజల పూజలు అందుకుంటోంది. అమ్మవారి దర్శనానికి నిత్యం సుదూర ప్రాంతాల నుంచి భక్తులు వస్తుంటారు. ప్రస్తుత రోజుల్లో ఎవరైనా సౌకర్యానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. వేసవి మాత్రమే కాకుండా ఏకాలమైనా భక్తులు ఎక్కువ ఏసీ గదుల్లో వసతి పొందేందుకు ఆసక్తిచూపుతారు. అయితే భక్తులకు ఏసీ గదులు అందుబాటులో లేకుండాపోయాయి. దీంతో సాధారణ గదులతోనే భక్తులు సరిపెట్టుకోవాల్సి వస్తోంది. ఏసీ గదులను వీలైనంత వరకు పెంచేందుకు ఆలయ అధికారులు చొరవ తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.

ఏసీ గదులు పది మాత్రమే..

శ్రీ తిరుపతమ్మ సదన్‌లో మొత్తం 68 గదులు ఉన్నాయి. వాటిలో కేవలం పది మాత్రమే ఏసీ గదులు. వాటిలోనూ ఏసీ సక్రమంగా పనిచేయటం లేదని భక్తులు పేర్కొంటున్నారు. ఉన్న ఏసీ గదులకు కూడా అధికారులు, నాయకులు ఎప్పుడు బుకింగ్ ఇస్తారో తెలియని పరిస్థితి ఉంది. సాధారణ గదుల్లోనూ ఫ్యాన్‌లు సక్రమంగా పని చేయడం లేదని భక్తులు ఆరోపిస్తున్నారు. శ్రీగోపయ్య సత్రంలో మొత్తం 32 గదులు ఉన్నాయి. వాటిలో 14 గదులను ఆలయ కార్యాలయానికే వాడుతున్నారు. మిగిలిన 18 నాన్ ఏసీ గదులు భక్తులకు అందుబాటులో ఉన్నాయి. ఆ గదుల్లోనూ శ్లాబ్ నుంచి పెచ్చులు ఊడిపడుతున్నాయి. సాక్షాత్తూ ఆలయ ఈఓ కార్యాలయం ముందే పెచ్చులూడి పడ్డాయి. ఏసీ గదులు అందుబాటులో లేక పోవటంతో భక్తులు మునేరు అవతల ప్రైవేట్ వ్యక్తుల గదులను అద్దెకు తీసుకుంటున్నారు.

ఏటా సత్రాల ఆదాయం రూ.40 లక్షలు

ఆలయ సత్రాల నిర్వహణ హక్కులను బహిరంగ వేలం ద్వారా కాంట్రాక్ట్ ఇవ్వటంతో ఆలయానికి ఏటా రూ.40 లక్షల ఆదాయం వస్తోంది. ఆదాయం ఉన్నా వాటి నిర్వహణను పట్టించుకోవటం లేదని భక్తులు అంటున్నారు. వంట చేసుకునేందుకు షెడ్లు లేక పోవటంతో భక్తులు గదుల ముందటే వంట చేసుకుంటున్నారు. దీంతో అక్కడ అపరిశుభ్రంగా ఉంటోంది. వర్షం వచ్చినా, గాలులు వచ్చినా వంట చేసుకోవటం కష్టంగా మారుతోంది.

మరమ్మతులు చేయిస్తాం: అధికారులు

సత్రాల గదుల్లో అవసరమైన మరమ్మతులను వెంటనే చేయిస్తామని ఆలయ ఇంజినీరింగ్ అధికారులు పేర్కొన్నారు. భక్తులకు సౌకర్యార్థం మునేరు అవతల అమ్మవారి మామిడి తోటల్లో ఏసీ గదుల నిర్మాణం జరుగుతోందని తెలిపారు. ఏసీ గదుల పెంపుపై కూడా దృష్టి సారిస్తామని, భక్తుల సౌకర్యాలకు ప్రాధాన్యం ఇస్తామని పేర్కొన్నారు.

సౌకర్యాలు మెరుగు పరచాలి



ఆలయ సత్రాల గదుల్లో సౌకర్యాలు మెరుగు పరచాలి. అంతే కాదు అవి శుభ్రంగా ఉండేలా చూడాలి. సత్రాల గదులకు వెళ్లే చోట మెట్లు కూడా పగిలి పోయి ఉన్నాయి. ముఖ్యంగా ఏసీ గదులు మరిన్ని ఏర్పాటు చేస్తే బాగుంటుంది.

– ఆర్.అశ్విని, భక్తురాలు, హైదరాబాద్



ఆలయ ఈఓ గది ముందు పెచ్చులూడిన శ్లాబ్



ఆరుబయటే వంట చేసుకుంటున్న భక్తులు



గదుల్లో కనిపించని ఫ్యాన్లు

పారిశుద్ధ్యం విషయంలో నిర్లక్ష్యాన్ని సహించం

మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర



సచివాలయ సెక్రటరీల సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర

జగ్గయ్యపేట అర్బన్: పేట పురపాలక సంఘ పరిధిలోని శానిటరీ విభాగంలో ప్రజల నుంచి ఎటువంటి ఫిర్యాదులు వచ్చినా సహించేది లేదని, చర్యలు కఠినంగా ఉంటాయని మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర హెచ్చరించారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలోని తన చాంబర్‌లో మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర సచివాలయ శానిటరీ సెక్రటరీలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ పట్టణంలో ఎక్కడ చూసినా శానిటరీ వ్యవస్థకు సంబంధించిన ఫిర్యాదులే ఎక్కువ వస్తున్నాయన్నారు. జగ్గయ్యపేట పట్టణ అభివృద్ధి కోసం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నప్పటికీ పరిశుభ్రత లేకపోతే జగ్గయ్యపేట పట్టణంలో ప్రజలు అనారోగ్యానికి గురవుతారన్నారు. ముందు శానిటరీ విభాగంలో ఎటువంటి ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలని తెలిపారు. సచివాలయం శానిటరీ సెక్రటరీలకు ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని, కేటాయించిన సిబ్బందితో పనిచేయించాల్సిన బాధ్యత వారిదేనన్నారు. మున్సిపల్ కమిషనర్ సీహెచ్.నాగమల్లేశ్వరరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం



వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న న్యాయమూర్తులు

ధర్మవరప్పాడుతండ(జగ్గయ్యపేట): సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి శ్రావణి, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి శోభారాణి అన్నారు. ధర్మవరప్పాడుతండాలోని సచివాలయంలో మండల లీగల్ సర్వీస్ కమిటీ ఆధ్వర్యంలో భూచవరం ప్రభుత్వాస్పత్రి వైద్యులతో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తండాలలోని ప్రజలు సీజనల్ వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అనారోగ్య లక్షణాలు కనిపిస్తే వైద్యులను సంప్రదించి చికిత్స తీసుకోవాలని తెలిపారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యతనివ్వాలని చెప్పారు. మండల లీగల్ సర్వీస్ కమిటీ గిరిజన తండాలలో వైద్య శిబిరాలు నిర్వహించాలని సూచించారు. ముందుగా వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మణి, ప్రభుత్వ వైద్యులు అనిల్, కీర్తిరెడ్డి, సూపర్‌వైజర్ వెంకట్రావ్, ఏజీపీ పీఎల్ నరసింహారావు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అన్నెపాక సుందరరావు, న్యాయవాదులు వీరాంజనేయులు, నాగేశ్వరరావు, ప్రతాప్‌రెడ్డి, వీరాస్వామి పాల్గొన్నారు.

విద్యారంగంలోని సమస్యలపై తక్షణం స్పందించాలి



కంచికచర్లలో ఈఓపీఆర్డీకి వినతిపత్రం అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు

కంచికచర్ల: విద్యారంగంలో నెలకొన్న సమస్యలను ప్రభుత్వం సత్వరమే పరిష్కరించాలని యూటీఎఫ్ మండల అధ్యక్షుడు మేరుగ రామారావు, సంయుక్త కార్యదర్శి కోపూరు నాగేశ్వరరావు, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు పులి శ్రీనివాసరావులు డిమాండ్ చేశారు. విద్యా వ్యవస్థలో మార్పులు చేయాలని మండల పరిషత్ కార్యాలయంలో ఈఓపీఆర్డీ బొజ్జగాని శ్రీనివాసరావు, డిప్యూటీ తహసీల్దార్ షేక్ నాగుల్‌మీరాకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు సంఘ నాయకులు మాట్లాడుతూ, ప్రీ ప్రైమరీ స్కూల్‌తోపాటు 1నుంచి 5వ తరగతులను ఒకే పాఠశాలలో నడపాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఒకే సిలబస్ ఒకే పరీక్షా విధానాన్ని అమలు చేయాలన్నారు. జీఓ నంబర్ 117ను రద్దు చేసి జీఓ ఎంఎస్ నంబర్ 55 ప్రకారం ఉపాధ్యాయులను కేటాయించాలన్నారు. ఉపాధ్యాయులను బోధనేతర పనుల నుంచి మినహాయించాలని, పనిభారం తగ్గించాలన్నారు. మినిమమ్ టైంస్కేల్ ఉపాధ్యాయుల సర్వీసులను రెగ్యులరైజ్ చేయాలని కోరారు.

సేంద్రియ కర్బనంతో అధిక దిగుబడులు

నందిగామ టౌన్: భూమిలో సేంద్రియ కర్బనం పెంచటం వల్ల మొక్క పోషకాలను గ్రహిస్తుందని జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ మనీషా తెలిపారు. మండలంలోని ఐతవరం గ్రామంలో సేంద్రియ కర్బనంపై రైతులకు మంగళవారం అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యవసాయ పొలాలలో పశువుల వ్యర్థాలు, వానపాములు, జీలుగ, జనుము, పిల్లిపెసర పంటలు వేయటం వల్ల సేంద్రియ కర్బనాన్ని పెంపొందించుకోవచ్చన్నారు. దీని వల్ల సాగు ఖర్చులు తగ్గటంతో పాటు అధిక దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. ముఖ్యంగా పత్తిలో గులాబీ రంగు పురుగును నియంత్రించేందుకు సస్యరక్షణ చర్యలు పాటించాలని చెప్పారు. అంతే కాకుండా వరి పంటలో ప్రతి 20 సెంటిమీటర్లకు బాట వేసుకోవటం వల్ల పైరుకు గాలి, వెలుతురు తగలటంతో పాటు చీడపీడల ఉద్ధృతి తగ్గుతుందని వివరించారు. కార్యక్రమంలో ఏడీఏ శ్రీనివాస్, ఏవో ఖాశీ వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

పోలీసులను ఆశ్రయించిన ప్రేమ జంట



వివాహం చేసుకున్న ప్రేమ జంట

నందిగామ టౌన్: మండలంలోని సోమవరం గ్రామానికి చెందిన ప్రేమ జంట వివాహం చేసుకుని రక్షణ కల్పించాలని కోరుతూ పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు తెలిపిన సమాచారం మేరకు.. సోమవరం గ్రామానికి చెందిన జిల్లేపల్లి సతీష్ అదే గ్రామానికి చెందిన సరళ గత కొంతకాలంగా ప్రేమించుకుంటున్నారు. ఈ క్రమంలో కంచికచర్ల మండలం కీసర గ్రామంలోని ఆర్‌సీఎం చర్చిలో సోమవారం వివాహం చేసుకున్నారు. తమ వివాహాన్ని ఇరు కుటుంబాల వారు అంగీకరించకపోవటంతో తమకు రక్షణ కల్పించాలని కోరుతూ సోమవారం రాత్రి సమయంలో పోలీసులను ఆశ్రయించారని చెప్పారు. దీంతో ఇరువురి తల్లిదండ్రులను పిలిపించి వారికి కౌన్సెలింగ్ ఇచ్చినట్లు ఎస్ఐ పండుదొర తెలిపారు.

ముత్తారెడ్డిని పరామర్శించిన మాజీ సీఎం వైఎస్ జగన్

వీరులపాడు: గుండె శస్త్ర చికిత్స చేయించుకున్న జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కోటేరు ముత్తారెడ్డిని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం ఫోన్‌లో పరామర్శించారు. మండలంలోని పెద్దాపురం గ్రామానికి చెందిన ముత్తారెడ్డి ఇటీవల హైదరాబాద్‌లో గుండె శస్త్ర చికిత్స చేయించుకుని ఆయన నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్నారు. శాసన మండలి సభ్యుడు డాక్టర్ మొండితోక అరుణకుమార్ తాడేపల్లిలోని మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా ముత్తారెడ్డి శస్త్ర చికిత్స చేయించుకున్న విషయాన్ని ఆయనకు తెలుపగా వెంటనే ఫోన్ చేసి ముత్తారెడ్డిని పరామర్శించి, ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకున్నారు. తగినంత విశ్రాంతి తీసుకుని త్వరగా కోలుకోవాలని ఆయన సూచించినట్లు ముత్తారెడ్డి తెలిపారు. అనంతరం ముత్తారెడ్డి సతీమణి వీరులపాడు ఎంపీపీ కోటేరు లక్ష్మితో కూడా మాట్లాడారు. అధైర్య పడొద్దని పార్టీ అండగా ఉంటుందని సూచించినట్లు తెలిపారు.

సమస్యల పరిష్కారం కోరుతూ పాదయాత్ర



పాదయాత్ర చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

బూదవాడ(జగ్గయ్యపేట): గ్రామంలోని సమస్యలను పరిష్కరించాలని కోరుతూ పలు కార్మిక సంఘాలు మంగళవారం బూదవాడలో పాదయాత్ర చేశాయి. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కోట కల్యాణ్ ఆధ్వర్యంలో నాయకులు గ్రామంలో పర్యటించి ప్రజల అడిగి సమస్యలను తెలుసుకున్నారు. తెలంగాణ సరిహద్దులో గ్రామం ఉందని ఈ గ్రామంలో అల్ట్రాటెక్ కర్మాగారం ఉన్నప్పటికీ పారిశుద్ధ్యం, డ్రెయినేజీలు బాలేదన్నారు. గ్రామ పంచాయతీకి కూడా పన్నుల ద్వారా లక్షల ఆదాయం వస్తున్నా సమస్యలను మాత్రం పరిష్కరించటం లేదని తెలిపారు. ఈ విషయమై జిల్లా అధికారులకు కూడా వినతిపత్రం అందిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతు, రైతు, వ్యవసాయ, కార్మిక, సీఐటీయూ సంఘాల నాయకులు చనుమోలు సైదులు, గోపాల్, సోమేశ్వరరావు, నటరాజ్, కోట కృష్ణ పాల్గొన్నారు.

నేటి నుంచి ప్రత్యేక పారిశుద్ధ్య డ్రైవ్

జగ్గయ్యపేట: సీజనల్ వ్యాధుల కట్టడికి జిల్లా యంత్రాంగం రూపొందించిన ప్రత్యేక కార్యాచరణ అమలుకు అధికారులు సిద్ధం చేశారు. ఈ నెల 31 నుంచి ఆగస్టు తొమ్మిది వరకు 10 రోజుల పాటు అన్ని గ్రామాలలో ప్రత్యేక పారిశుద్ధ్య డ్రైవ్ నిర్వహించేందుకు కలెక్టర్ ఆదేశాల మేరకు అధికారులు సమాయత్తమయ్యారు. 31న గ్రామాలలో ఓవర్ హెడ్ ట్యాంకులు, శుభ్రం చేయటం, ఆగస్టు ఒకటో తేదీన డ్రెయినేజీలు, కచ్చా డ్రెయిన్‌లు క్లీనింగ్, రెండో తేదీన గ్రామాలలో డ్రెయిన్‌ల పూడిక తీత, మూడో తేదీన దోమల మందు పిచికారీ, నాలుగో తేదీన దోమల నివారణ మందుతో పాటు మురుగు ప్రాంతాలలో బ్లీచింగ్ చల్లించటం, ఐదో తేదీన మురుగు ప్రాంతాలలో లార్వా నియంత్రణకు మలాథీన్‌తో పాటు ఆయిల్ బాల్స్ చల్లటం, ఆరో తేదీన ఏజెన్సీ ప్రాంతాలలో ఫాగింగ్, ఏడో తేదీన ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరించటంపై అవగాహన, ఎనిమిదో తేదీన తడిపొడి చెత్తపై అవగాహన, తొమ్మిదో తేదీన గ్రామాలలో తాగునీటి బోర్ల మరమ్మతులు వంటి కార్యక్రమాల నిర్వహణకు అధికారులు ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే మండల, గ్రామ స్థాయి అధికారులు కార్యక్రమాలకు సిద్ధమయ్యారు.

విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి

సైబర్ క్రైమ్‌పై అవగాహన సదస్సులో ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజగోపాల్, వేదికపై ఏసీపీ రవికిరణ్ తదితరులు

జగ్గయ్యపేట అర్బన్: బంగారు భవిష్యత్ ఉన్న విద్యార్థులు, యువత.. మద్యం, ధూమపానం, డ్రగ్స్ తదితర దుర్వ్యసనాలతో తమ శారీరక, మానసిక దౌర్బల్యానికి గురవుతున్నారని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ అన్నారు. మంగళవారం స్థానిక చిల్లకల్లు రోడ్‌లోని శుభమస్తు ఫంక్షన్ హాల్‌లో ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్, జగ్గయ్యపేట సర్కిల్ పోలీస్ ఆధ్వర్యంలో సైబర్ క్రైమ్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ నేటి ఆధునిక సమాజంలో యువత సెల్ ఫోన్లుతోనే ఎక్కువ సమయం గడుపుతూ తమ విలువైన సమయాన్ని వృథా చేసుకుంటున్నారని తెలిపారు.

దురాశతో దుఃఖం..

నందిగామ ఏసీపీ డాక్టర్ బి.రవికిరణ్ మాట్లాడుతూ తక్కువ కాలంలో ఎక్కువ సంపాదించాలనే దురాశతో నేటి యువత చెడు మార్గంలో పడుతున్నారని తెలిపారు. లోన్ యాప్‌లు, పార్ట్‌టైమ్ జాబ్‌లు, తక్కువ సమయంలో ఎక్కువ లాభాలు పొందటం ఎలా? అనే నకిలీ ప్రకటనలను సోషల్ మీడియాలో చూసి యువత మోసపోతున్నారన్నారు. తద్వారా తమ విలువైన జీవితాలను నాశనం చేసుకుంటున్నారని తెలిపారు. సమావేశంలో పేట సీఐ జానకీరామ్, జగ్గయ్యపేట టౌన్ ఎస్ఐలు సూర్యభగవాన్, పద్మారావు, చిల్లకల్లు, వత్సవాయి, పెనుగంచిప్రోలు ఎస్ఐలు సతీష్, అభిమన్యు, రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

రైతు బజారులో ఉచితంగా దోసకాయల పంపిణీ

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని మినీ బైపాస్ రోడ్‌లో నూతనంగా పునఃప్రారంభించిన రెండో రైతు బజారులో మంగళవారం దోసకాయలను ఉచితంగా పంపిణీ చేశారు. వినియోగదారులను ఆకర్షించేందుకు ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ సూచనల మేరకు ఎస్టేట్ ఆఫీసర్ కేవీ.రమణ, టీడీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి మైనేని రాధా, 10వ వార్డు మున్సిపల్ కౌన్సిలర్, టీడీపీ నియోజకవర్గ తెలుగు మహిళ అధ్యక్షురాలు కన్నెబోయిన రామలక్ష్మి వినియోగదారులకు ఉచితంగా దోసకాయలను అందజేశారు. దోసకాయలను ఉచితంగా పంపిణీ చేయడం పట్ల వినియోగదారులు సంతోషం వ్యక్తం చేశారు.

ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

కాకరవాయి(వత్సవాయి): పిన్నమనేని సిద్ధార్థ కంటి వైద్యశాల, కొమరగిరి ట్రస్టు ఆధ్వర్యంలో మంగళవారం గ్రామంలోని ఎంపీపీ పాఠశాలలో ఉచిత కంటి వైద్యశిబిరాన్ని నిర్వహించారు. శిబిరాన్ని సర్పంచ్ గుర్రం సత్యావతి ప్రారంభించారు. మొత్తం 118 మంది శిబిరంలో పాల్గొనగా వారిని వైద్యులు జాహ్నవి, విభా, ప్రిస్కిల్లాలు వైద్య పరీక్షలు నిర్వహించారు. వారిలో 18 మందికి ఆపరేషన్లు అవసరమని గుర్తించి వెంటనే వారిని ప్రత్యేక వాహనంలో వైద్యశాలకు తరలించి ఉచితంగా ఆపరేషన్లు చేయనున్నట్లు ట్రస్టు చైర్మన్ కేఆర్ భరద్వాజ్ తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు గుర్రం రామారావు, రామాలయం కమిటీ కన్వీనర్ స్వామి, గంగవరపు శ్రీనివాస్, పీఆర్‌వో రాఘవ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు న్యూట్రిషన్ గార్డెన్‌పై అవగాహన

అనుమంచిపల్లి(జగ్గయ్యపేట): స్థానిక మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో కేవీకే ఆధ్వర్యంలో మంగళవారం విద్యార్థులకు న్యూట్రిషన్ గార్డెన్‌పై అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ కృష్ణంరాజు మాట్లాడుతూ విద్యార్థులు పెరటిలో పౌష్టికాహారం అందించే కూరగాయలు, ఆకుకూరలను పెంచుకోవాలన్నారు. బలవర్ధక ఆహారం తీసుకోవాలని తెలిపారు. అనంతరం ఆకుకూరలు, కూరగాయల విత్తనాలను నాటించారు. గృహ విజ్ఞాన శాస్త్రవేత్త ప్రభావతి, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


విద్యార్థుల ఉన్నతికి కృషి చేసేది ఉపాధ్యాయుడే



ప్రసాద్ దంపతులను సత్కరిస్తున్న ఎంఈఓలు వెంకటరత్నం, బాలాజీ

కంచికచర్ల: ఉపాధ్యాయ వృత్తిలో ఉన్నంతకాలం ఉపాధ్యాయులు విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దాలనే తపనతో పనిచేస్తుంటారని, ఆ తర్వాత పదవీ విరమణ తప్పదని ఎంఈఓ-1 ఆదూరి వెంకటరత్నం, ఎంఈఓ-2 బి. బాలజీ పేర్కొన్నారు. స్థానిక ఓసీ కల్యాణ మండపంలో ఇందిరా కాలనీ ఎంపీపీ స్కూల్ ప్రధానోపాధ్యాయుడిగా పనిచేసిన వేమవరపు ప్రసాద్ ఉద్యోగ విరమణ కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన ఎంఈఓ-1, ఎంఈఓ-2లు మాట్లాడుతూ 44 ఏళ్ల పాటు ఉపాధ్యాయుడిగా పనిచేసి ఎంతో మంది విద్యార్థులను తీర్చిదిద్దిన ఉపాధ్యాయుడు ప్రసాద్ అని కొనియాడారు. అనంతరం ప్రసాద్ దంపతులకు పూలమాలలు వేసి శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో రిటైర్డ్ రిజిస్ట్రార్ కోట దేవదాసు, రిటైర్డ్ ఎంప్లాయిస్ యూనియన్ కార్యదర్శి ముండ్లపాటి పోతరాజు, కోట పూర్ణచంద్రరావు, ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు వేముల భిక్షమయ్య, యూటీఎఫ్ మండల అధ్యక్షుడు మేరుగ రామారావు తదితరులు పాల్గొన్నారు.

విస్మరణకు గురవుతున్న బలహీన వర్గాలు: వక్తలు



మాట్లాడుతున్నపూర్ణచంద్రరావు

జగ్గయ్యపేట అర్బన్: స్వాతంత్ర్య వచ్చి 77 ఏళ్లు గడిచినప్పటికీ బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాల జీవితాల్లో వెలుగు రాలేదని, దానికి కారణం ఇప్పటి వరకు దేశాన్ని, రాష్ట్రాన్ని పాలించిన పాలకవర్గాలు ఆ వర్గాలను విస్మరించడమేనని పలువురు వక్తలు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఉక్కు కళావేదికలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, ముస్లిం, క్రిస్టియన్ మైనార్టీ కులాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో 'అధికారం' అనే అంశంపై రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి విద్యావేత్త కేవీ రత్నం అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథులుగా మాజీ డీజీపీ, బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర కోఆర్డినేటర్ జె.పూర్ణచంద్రరావు, రాష్ట్ర అధ్యక్షుడు బక్కా పరంజ్యోతి, రాష్ట్ర అధికార ప్రతినిధి లెక్కపోగు వందన్‌కుమార్ పాల్గొని ప్రసంగించారు. ఆగస్టు 18న విజయవాడలో బీసీ జన గణన కోరుతూ బీసీ రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నామని, ఈ కార్యక్రమంలో బీసీలు హాజరై తమ అభిప్రాయాలను వ్యక్తం చేయాలని కోరారు. బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బచ్చలకూర పుష్పరాజు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొదమల ప్రభుదాసు, బీసీ నాయకులు పాల్గొన్నారు.